క్లుప్తంగా

కార్యకర్తకు అండగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైద్య ఖర్చుల కోసం నగదు అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: రామచంద్రాపురం మండలం కొత్త వేపకుప్పం పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు గురవారెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రిలో గురవారెడ్డిని పరామర్శించిన తుడా చైర్మన్, వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వైద్య ఖర్చులకు సాయం అందిస్తామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం గురవారెడ్డి కుమారుడు శేఖర్‌కు రూ.20 వేల నగదు అందించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరలోనే గురవారెడ్డి కోలుకుంటారని ధైర్యం, ఏ అవసరమొచ్చినా తెలియజేయాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హిమాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో మానసిక నైపుణ్యం



గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమం

చంద్రగిరి: గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా మానసిక నైపుణ్యం లభిస్తుందని ఎంఈఓ లలితకుమారి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె చేతుల మీదుగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీపీ స్కూల్ విశ్రాంత హెచ్ఎం రామిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీటీసీ వర్కర్ భారతి, గ్రంథాలయ అధికారి రెడ్డమ్మ, విద్యార్థులు, పాఠకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం జిల్లా పరిషత్ పాఠశాలలో సొసైటీ ఫర్ సోషియల్ సర్వీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాఠశాలలో చదువుతున్న 65 మంది 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసామగ్రిని ఉపయోగించుకుని 10వ తరగతి పరీక్షలకు చక్కగా సన్నద్ధం అవ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయిబాబా హుండీ ఆదాయం రూ.4.74 లక్షలు



హుండీ లెక్కింపు చేపడుతున్న బ్యాంక్ సిబ్బంది, భక్తులు

తిరుపతి కల్చరల్: కొంకా వీధిలో వెలిసిన శ్రీద్వారకామయి శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో మంగళవారం చేపట్టిన హుండీ లెక్కింపు ద్వారా రూ.4,74,990 ఆదాయం లభించినట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం తెలిపారు. ఆలయం ఆవరణలో చేపట్టిన హుండీ లెక్కింపు కార్యక్రమానికి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, వెస్ట్ పోలీసులు, శ్రీద్వారకామయి శ్రీషిరిడి సాయిబాబా సేవా సమాజ్ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. సాయి మందిరంలో ప్రతి 45 రోజులకొక సారి హుండీ లెక్కింపు చేపడతారు. సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి మర్దం శివ, దుర్గం శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి కుడితి హరిబాబు, ఆవుల శ్రీనివాసమూర్తి, విజయలక్ష్మి బాలకృష్ణ పాల్గొన్నారు.

వేదనారాయణస్వామి సేవలో జిల్లా కలెక్టర్

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేదనారాయణస్వామి ఆలయాన్ని మంగళవారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారి శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు, తహసీల్దారు ప్రసన్న కుమార్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటే బహిష్కరించాలి

- తిరుపతి మరింత అభివృద్ధికి టీటీడీ నిధులు ఎంతో అవసరం
- ఉద్యమ పోరాటాలతోనే టీటీడీ నిధులు సాధించుకుందాం
- బీజేపీ నాయకులకు తిరుపతి అభివృద్ధి ఇష్టం లేదా..?
- మన ఊరు-మన అభివృద్ధి-మన ఆత్మగౌరవం కార్యక్రమంలో అఖిలపక్షనేతలు





మన ఊరు-మన అభివృద్ధి రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భూమన సుబ్రమణ్యంరెడ్డి(భూమన్), హాజరైన అఖిలపక్ష నాయకులు, మేధావులు

తిరుపతి మంగళం: తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే వారిని నగరం నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని రాయలసీమ అధ్యయన సంస్థ అధ్యక్షుడు, శ్వేత భవనం మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి(భూమన్)తోపాటు అఖిలపక్ష నేతలు ముక్తకంఠంతో చెప్పారు. తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ సమీపంలోని ఓ హాల్లో మంగళవారం మన ఊరు-మన అభివృద్ధి-మన ఆత్మగౌరవంపై అఖిలపక్షం నాయకులు కందారపు మురళి, అంజయ్య, కేతారి రాధాకృష్ణ, నాగరాజు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, తులసేంద్ర, రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారితో పాటు మేధావులు, ఇతర నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తిరుపతి అభివృద్ధిపైన అఖిలపక్ష నాయకులు, మేధావులు విస్తృతంగా చర్చించారు. తిరుపతి అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీ నాయకులకు బుద్ధి చెప్పి, ప్రజలను భాగస్వాములు చేసుకుని తిరిగి టీటీడీ నిధులు సాధించుకోవడం కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, ఐద్వా లక్ష్మి, బెల్లంకొండ సురేష్, వైఎస్ఆర్ సీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, మేధావులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడితే చరిత్ర హీనులే...



తిరుపతి అభివృద్ధికి ఎవ్వరు అడ్డుపడినా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. టీటీడీ ఒక శాతం నిధులతో మరింత అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుపరచుకో వచ్చుననుకున్నాం. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు రాకుండా అడ్డుపడిన బీజేపీ నాయకులు తిరుపతి ద్రోహులుగా మిగిలిపోతారు. టీటీడీ నిధులను తీసుకెళ్లి ఇతర రాష్ట్రాల్లో ఆలయాల నిర్మాణం, ఇతర అభివృద్ధికి వినియోగించినప్పుడు భానుప్రకాష్‌రెడ్డికి కనిపించలేదా. అభివృద్ధిని చూసి అభినందించాలే తప్ప అడ్డుపడకూడదు. టీటీడీ నిధులు తిరిగి సాధించుకోవడం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అందులో ప్రజలు సైతం భాగస్వాములు కావాలి. – అంజయ్య, ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు

పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుంచి రోజుకు సుమారు లక్ష మంది తిరుపతి నగరానికి వస్తున్నారు. వారంతా వివిధ రూపాలలో చెత్తా చెదారాలను రోడ్లపై పడవేస్తున్నారు. ఆ చెత్తా చెదారాలను తొలగించకుండా ఉంచితే రోగాలు ప్రబలుతాయి. పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండగలుగుతాం. కేవలం 25వ డివిజన్‌లోని గోవిందరాజులస్వామి ఆలయ పరిసరాల్లో భక్తులు పడవేసే చెత్తను తొలగించడానికే అనేక మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం. తిరుపతి అభివృద్ధితోపాటు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుకోవడం కోసం టీటీడీ నిధులు ఎంత అవసరమో బీజేపీ నాయకులకు తప్ప అందిరికి తెలుసు.
– నరసింహాచారి, కార్పొరేటర్

ప్రజాసేవకులు పారిశుద్ధ్య కార్మికులు



తమ ఆరోగ్యాలను పట్టించుకోకుండా ప్రాణాలను సైతం పణంగా పెట్టి నగర పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రజాసేవకులు పారిశుద్ధ్య కార్మికులు. అలాంటి కార్మికులకు సొంతింటితోపాటు ఎన్ని వసతులు కల్పించినా తక్కువే అవుతుంది. తిరుపతి నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడం కోసం మరింత మందికి కార్మికులుగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయం. అవసరమైతే ప్రభుత్వంతో పోరాడి టీటీడీ నిధులను తిరిగి తీసుకురావడం కోసం ఉద్యమిద్దాం. –తులసేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు

తిరుపతి అభివృద్ధిని అందరూ స్వాగతించాలి



తిరుపతిలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరుగుతుండడం అభినందనీయం. ఇంతగా అభివృద్ధి జరుగుతుండడాన్ని ప్రతి ఒక్కరు స్వాగతించాల్సిన అవసరం ఉంది. ఏ పార్టీ అభివృద్ధి చేస్తున్నా అడ్డుపడడం భావ్యం కాదు. బీజేపీ నాయకులు మూర్ఖంగా వ్యవహరిస్తూ తిరుపతి అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావట్లేదు. అభివృద్ధికి ఎవ్వరూ అడ్డుపడినా వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. టీటీడీ నిధులు సాధించుకోవడం కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి. – వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా అధ్యక్షులు

ఉద్యమాలతోనే టీటీడీ నిధులు



తిరుపతి అభివృద్ధికి అడ్డుపడిన బీజేపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు. తిరుపతిని అన్ని విధాలా మరింత అభివృద్ధి చేసుకోవడానికి టీటీడీ నిధులు ఎంతో అవసరం. ఆ నిధులను సాధించుకోవడం కోసం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలి. అభివృద్ధిలో కొందరికి అన్యాయం జరిగినా ఎంతో మందికి మేలు జరుగుతుంది. తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి గతంలోఎప్పుడూ జరగలేదు. – కేతారి రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యమాలకు సిద్ధం



తిరుపతిని మరింత అభివృద్ధి చేసుకోవడానికి మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది. టీటీడీ నిధులను రానివ్వకుండా అడ్డుపడిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. తిరుపతి అభివృద్ధిని చూస్తుంటే ఎంతో సంతోషమేస్తోంది. అలాంటి అభివృద్ధిని అడ్డుకోవాలని చూడడం బాధాకరం. టీటీడీ నిధులను తిరిగి తీసుకురావడం కోసం ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధం. రాజకీయాలకు అతీతంగా తిరుపతి అభివృద్ధిని ప్రతి ఒక్కరు స్వాగతించాలి. – ఆర్కాట్ కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు

చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి...

20ఏళ్లల్లో ఎన్నడూ చూడనంతగా తిరుపతి అభివృద్ధి జరుగుతోంది. ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే వారు సైతం నగర అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారు. శ్రీవారి భక్తుల తాకిడితో తిరుపతి నగరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు తిరుపతిని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి టీటీడీ ఒక శాతం నిధులు ఎంతో అవసరం. టీటీడీ నిధులు రాకుండా అడ్డుపడుతున్న బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డికి తిరుపతి అభివృద్ధి జరగడం ఇష్టం లేనట్లుగా ఉంది. బీజేపీ వైఖరిని చూసి ప్రజలు సైతం దుమ్మెత్తిపోస్తున్నారు. అనేక సార్లు శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేస్తూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తిరుపతి అభివృద్ధికి ఏం చేసిందో చెప్పాలి.
– భూమన సుబ్రమణ్యంరెడ్డి(భూమన్), రాయలసీమ అధ్యయన సంస్థ అధ్యక్షుడు

అభివృద్ధికి అడ్డుపడితే నగర బహిష్కరణ



తిరుపతిలో నివాసం ఉంటున్న ఎవ్వరైనా నగర అభివృద్ధికి అడ్డుపడితే వారిని బహిష్కరించాలి. రాజకీయాలకు అతీతంగా తిరుపతిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటి మేయర్ భూమన అభినయరెడ్డిలను ప్రతి ఒక్కరు అభినందించక తప్పదు. అంతగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నారు. అలాంటి తరుణంలో మరింత అభివృద్ధి చేసేందుకు టీటీడీ పాలకమండలి ఆమోదంతో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక శాతం నిధులను తిరుపతి అభివృద్ధికి కేటాయిస్తే బీజేపీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటు. ఎవ్వరైనా, ఏ పార్టీ అయినా అభివృద్ధిని స్వాగతించాలి. అందుకోసం పార్టీలకు అతీతంగా కలిసి పోరాడాలి. అభివృద్ధిని అడ్డుకుంటే తిరుపతి ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారు.
– కందారపు మురళి,
సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభ్యంతరాలు త్వరగా అందించాలి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై చర్చిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి సిటీ: ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే త్వరగా తమకు అందించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల క్రితమే ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల చేశామని, జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. బీఎల్ఓలు ఎన్నికల విధులు చాలా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఈడీటీ జీవన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్‌లో బాలోత్సవ పోటీలు



విద్యార్థుల పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలోత్సవం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: పాఠశాల స్థాయిలో పిల్లల్లో సామాజిక స్పృహ, దేశభక్తి, సమష్టితత్వం, శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించాలనే సంకల్పంతో పిల్లల పండుగ పేరుతో డిసెంబర్ 16, 17వ తేదీల్లో రెండు రోజుల పాటు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో సుమారు 29 రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టింకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డినారాయణ తెలిపారు. మంగళవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు నాలుగు విభాగాలుగా ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ, మున్సిపల్ స్కూళ్ల నుంచి పెద్ద ఎత్తున పిల్లలు పాల్గొనేలా ప్రోత్సహించి వారి మానసిక వికాసానికి బాటలు వేయాలని కోరారు. తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, తిరుపతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గురునాథం, రెడ్డప్ప, తహసున్నీసా, మునిలక్ష్మి, సుజాత, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలాజి చౌదరి, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా నిరసన

తిరుపతి మంగళం: తిరుపతి నగరాభివృద్ధికి సహకరించాల్సిన బీజేపీ నాయకుడు బానుప్రకాష్‌రెడ్డి అభివృద్ధిని అడ్డుకునే ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతాడని వైఎస్ఆర్ సీపీ సేవాదళ్ కో-ఆర్డినేటర్ తలారి రాజేంద్ర మండిపడ్డారు. తిరుపతి జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటి మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని రాజేంద్ర తెలిపారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు టీటీడీ నుంచి ఒక శాతం నిధులు మంజూరు చేస్తే వాటిని రానివ్వకుండా అడ్డుపడిన ద్రోహి భానుప్రకాష్‌రెడ్డి అని మండిపడ్డారు. ఇలాంటి ద్రోహులను తిరుపతి నగరం నుంచి వెలేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి అభివృద్ధిని చూసి నగర ప్రజలంతా ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని, అయితే బీజేపీ నాయకులకు మాత్రం తిరుపతి అభివృద్ధి చెందడం ఇష్టం లేనట్లుందన్నారు. టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, దేవదానం, రెడ్డప్ప, కోటి, రమణ, మధుసూదన్‌నాయుడు, అక్కినపల్లి లక్ష్మయ్య, బాలాజీ, మదన్, సుబ్రమణ్యం, నవీన్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎంఆర్‌హెచ్ఆర్‌యులో వర్క్‌షాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

చంద్రగిరి: మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్(ఎంఆర్‌హెచ్ఆర్‌యు)లో రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎంఆర్‌హెచ్ఆర్‌యు, తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల, హైదరాబాద్‌కు చెందిన జాతీయ పోషకాహార సంస్థ(ఐసీఎంఆర్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 'క్వాలిటేటివ్ రీసెర్చ్' అనే అంశంపై వర్క్‌షాపును నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం జరిగిన వర్క్‌షాప్‌లో జాతీయ పోషకాహార సంస్థ(ఐసీఎంఆర్), ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి శాస్త్రవేత్తలు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి నుండి అధ్యాపకులు పాల్గొని ప్రసంగాలు చేశారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి, నోడల్ అధికారి డాక్టర్ సునీత, సత్యేంద్రనాథ్, సుబ్బారావు, త్రిపుర సుందరి, యువి. ప్రసాద్, వినీల సాహితి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



నూతన వధువు కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను వైఎస్ఆర్ సీపీ నాయకులు వధూవరులకు అందజేశారు. మంగళవారం మండల పరిధిలోని అగరాల పంచాయతీ వినాయక నగర్‌కు చెందిన ఉదయశ్రీ, మురళికుమార్, చంద్రగిరి బజారువీధికి చెందిన నరసింహులు, ప్రియాంకలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ-వడ, అమ్మవారి పసుపు-కుంకుమ, వెండి మెట్టెలతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, గోపాల్‌శెట్టి, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రహీమ్, వెంకటముని, భారతి, సునీల్, ముదికుప్పం రామ్మూర్తి, బాహర్, అంగేరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేటలో...

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ కూలివాండ్లపల్లె వడ్డిపల్లెకు చెందిన నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను గ్రామ సర్పంచ్ సింహాల విమల చేతుల మీదుగా అందించారు. మంగళవారం వధువు తల్లిదండ్రులు హేమలత, రమణకి అందించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, వార్డు మెంబరు నారాయణమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాకాలలో...

పాకాల: ఆదినపల్లి గ్రామం, గుంత గాదంకి, రామిరెడ్డిగారి ఇండ్లు గ్రామాల్లో నూతనంగా పెళ్లి చేసుకోబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. మంగళవారం కాబోయే దంపతులకు స్థానిక నాయకుల చేతుల మీదుగా పెళ్లి కానుకను అందజేశారు. ఆదినపల్లిలో కాబోయే వధూవరులు శిరీష, హిమవర్ధన్, గుంతగాదంకి గ్రామంలో కాబోయే దంపతులు గోపిప్రియ, రమేష్‌లకు, ఉప్పరపల్లి పంచాయతీ రామిరెడ్డిగారిఇండ్లు గ్రామంలో దిలీప్, నాగప్రియ, అదే గ్రామంలో సాయితేజేశ్వరావు, కావ్యభువనేశ్వరిలకు పెళ్లి కానుక అందజేశారు. మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీలు శ్యామల, సురేష్, బాలకృష్ణనాయుడు, అన్నాబాబురెడ్డి, పురుషోత్తం నాయుడు, భాస్కర్‌నాయుడు, లోకనాథరెడ్డి, పరదేశినాయుడు, మోహన్‌నాయుడు, కృష్ణయ్యనాయుడు, మునిరత్నంరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తులసీరామ్ ఆచారి, వేణుగోపాల్‌రెడ్డి, నాగూర్ పాల్గొన్నారు.



పెళ్లికానుకను అందజేస్తున్న గ్రామ సర్పంచ్ విమల



ఆదినపల్లిలో పెళ్లికానుకను అందజేస్తున్న వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్



రామిరెడ్డిగారిఇండ్లు గ్రామంలో పెళ్లి కానుకను అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజాగ్రహం

- బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డికి వైఎస్ఆర్ సీపీ నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం నేత పసుపులేటి సురేష్

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఉంటూ తన స్వార్థ రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డుతున్న బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేత పసుపులేటి సురేష్ హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి టీటీడీ నిధుల నుంచి ఒక శాతం కేటాయించేందుకు నిర్ణయించారన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 9 మంది బీజేపీ నేతలు టీటీడీ బోర్డు సభ్యులుగా ఉంటూ ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అయితే బీజేపీ అంటే తానే అన్నట్టుగా భానుప్రకాష్‌రెడ్డి ఈ నిర్ణయంపై కుటిల రాజకీయంతో వ్యతిరేకించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. శ్రీనివాస సేతు నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చిందని, తిరుపతి అభివృద్ధికి సైతం నిధులు కేటాయిస్తోందని బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరమన్నారు. ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ప్రజా సంక్షేమం కోసం, తిరుపతిని గ్లోబల్ సిటీగా రూపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అభివృద్ధిని అడ్డుకునే ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ సీపీ నేతలు ఎంఎస్.సురేష్, కేఎస్.కిరణ్, కిషోర్, ప్రవీణ్ రాయల్, ప్రభు, శ్రీధర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ లేలాండ్ బడాదోస్త్-ఐ2 వాహనం విడుదల

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని అశోక్ లేలాండ్ అధీకృత డీలర్ అయిన హితైషి మోటార్స్ వారు కొత్త వాణిజ్య వాహనం బడా దోస్త్-ఐ2ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈసందర్భంగా హితైషి మోటార్స్ యజమాని టి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ కొత్త బడాదోస్త్-ఐ2 వాహనం 70 జీపీ, 1425 పాసింగ్ సదుపాయాలతో 9 అడుగుల పొడవు, 5.9 అడుగుల వెడల్పు కలిగి, రవాణాకు అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ నూతన బడా దోస్త్ -ఐ2 వాహనాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



హితైషి మోటార్స్ నూతన బడాదోస్త్ -ఐ2 వాహనం విడుదల